## కార్పోరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన షేక్ రేష్మ

**నెల్లూరు కార్పోరేషన్, జులై 20 ప్రభాతవార్త :** ప్రభుత్వ ఆదేశాల మేరకు నెల్లూరు నగరపాలకసంస్థను బలోపేతం చేసేందుకు గ్రూప్–2 నుంచి ఎంపికైన షేక్. రేష్మ కార్పోరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌గా సోమవారం ఉదయం కార్పోరేషన్ కార్యాలయంలో పదవి బాద్యతలు స్వీకరించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో రేష్మ సోమవారం కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.







# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, జులై 20, ప్రభాత వార్త:** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం సాయంత్రానికి 0 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 31.202 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 150, ఎన్ఎఫ్‌సికి 50, పెన్నా డెల్టా 1400 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 91.921 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## కష్టపడితే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చు

- అపజయాన్ని విజయానికి పునాదిగా మలుచుకోవాలి
- రాష్ట్ర పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ
- ప్రతిభావంతులైన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డ్స్
-2026 అవార్డులు ప్రదానం చేసిన మంత్రి, కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు, జూలై 20, ప్రభాతవార్త – కలెక్టరేట్:** జీవితంలో ఏ లక్ష్యాన్నైనా సాధించాలంటే కష్టపడటమే ఏకైక మార్గమని, అపజయాన్ని చూసి నిరాశ చెందకుండా దానిని విజయానికి పునాదిగా మలుచుకోవాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ విద్యార్థులకు సూచించారు. సోమవారం ఉదయం విద్యాశాఖ ఆధ్వర్యంలో నెల్లూరులోని శ్రీ కస్తూర్బా కళాక్షేత్రంలో నిర్వహించిన షైనింగ్ స్టార్స్ అవార్డ్స్–2026 కార్యక్రమంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రతిభావంతులైన విద్యార్థులను సత్కరించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ చిన్నప్పుడు ఆటలపై మక్కువతో చదువుపై శ్రద్ధ పెట్టకపోవడంతో తాను పదో తరగతిలో ఒకసారి విఫలమైనట్లు మంత్రి గుర్తు చేసుకున్నారు. అయితే ఆ అపజయాన్ని సవాల్‌గా తీసుకుని రోజుకు 15-16 గంటలు కష్టపడి చదివి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించానని చెప్పారు. అనంతరం వీఆర్ కళాశాలలో డిగ్రీ, ఎస్వీ యూనివర్సిటీలో ఎంఎస్సీ పూర్తి చేసి రెండింటిలోనూ కాలేజ్ టాపర్‌గా నిలిచానన్నారు. నెలకు రూ.120 జీతంతో పార్ట్‌టైమ్ లెక్చరర్‌గా ప్రారంభమైన తన ప్రయాణం, నేడు దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులకు విద్యను అందించే సంస్థలను నిర్మించే స్థాయికి చేరిందన్నారు. ప్రతి విద్యార్థిలోనూ ప్రత్యేకమైన ప్రతిభ ఉంటుందని, దానిని గుర్తించి ప్రోత్సహించే బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో విద్యా రంగంలో అనేక సంస్కరణలు అమలవుతున్నాయని, విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ విద్యార్థులకు కేవలం ప్రతిభ ఉంటే సరిపోదని, జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలంటే అంకితభావం, కమిట్‌మెంట్, క్రమశిక్షణ అత్యంత అవసరమన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్య విద్యార్థుల జీవితంలో కీలకమైన మైలురాళ్లని, వారి విజయాల వెనుక తల్లిదండ్రులు, ముఖ్యంగా తల్లులు పడే కష్టం ఎంతో గొప్పదని కొనియాడారు. తాను కూడా 23 సంవత్సరాల క్రితం ఇంటర్మీడియట్ టాపర్‌గా ఇలాంటి వేదికపైనే నిలబడ్డానని, నేడు అదే వేదికపై విద్యార్థులను అభినందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పాఠశాల విద్య పూర్తయిన తర్వాతే అసలైన జీవిత ప్రయాణం ప్రారంభమవుతుందని, ఇకపై ప్రతి నిర్ణయాన్ని బాధ్యతగా తీసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. చదువుకునే సమయంలో యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా డిస్ట్రాక్షన్లకు దూరంగా ఉండాలని, ప్రతిరోజూ ప్రణాళికాబద్ధంగా సమయం కేటాయించి చదివే క్రమశిక్షణ కలిగిన విద్యార్థులే గొప్ప విజయాలు సాధిస్తారని చెప్పారు. మన ప్రాంతంలో ప్రతిభకు కొదవ లేదని, క్రమశిక్షణతో కూడిన కృషి ఉంటే ఎవరైనా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. ప్రభుత్వం విద్యా రంగంలో నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక సదుపాయాలు, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు అందిస్తూ విద్యా ప్రమాణాలను పెంచుతోందని తెలిపారు. విద్యార్థులు ఐఐటీ, ఎంబీబీఎస్ వంటి తమ లక్ష్యాలను సాధించి భవిష్యత్తులో నక్షత్రాల్లా వెలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్చి–2026 పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్, ప్రశంసా పత్రం, రూ.20 వేల నగదు బహుమతి అందజేశారు. జిల్లా వ్యాప్తంగా ఎంపికైన 224 మంది పదో తరగతి, 36 మంది ఇంటర్మీడియట్ ప్రతిభావంతులైన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నగర మేయర్ దేవరకొండ సుజాత మాట్లాడుతూ విద్యార్థులు ఇదే స్ఫూర్తితో ఉన్నత లక్ష్యాలు అధిరోహించాలని పిలుపునిచ్చారు. క్రమశిక్షణ, కష్టపడే తత్వంతో ఏదైనా సాధించవచ్చని, విద్యార్థులందరూ ఇదే సూత్రాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్ బాలాజీ రావు, సమగ్ర శిక్ష ఏపీసి వెంకటసుబ్బయ్య, వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటి నుంచి మహిళా పారిశ్రామికవేత్తే లక్ష్యం

- మెప్మా మహిళల వ్యాపారాభివృద్ధిపై ప్రతి నెలా సమీక్ష నిర్వహిస్తా - మంత్రి నారాయణ



**నెల్లూరు, జూలై 20, ప్రభాతవార్త** ప్రతి ఇంటి నుంచి కనీసం ఒక మహిళా పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం విస్తృత అవకాశాలు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. నెల్లూరులోని చింతారెడ్డి పాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం మెప్మా అధికారులు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు (సీఓలు), రిసోర్స్ పర్సన్లు (ఆర్పీలు), మహిళా సంఘాల సభ్యులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. మెప్మా మహిళలు నిర్వహిస్తున్న వివిధ వ్యాపారాల పురోగతి, లావాదేవీలపై ఆరా తీశారు. జీవనోపాధి అవకాశాలను మరింత విస్తరించేందుకు పలు సూచనలు చేశారు. పట్టణ పేదరిక నిర్మూలనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, లైవ్లీహుడ్ యూనిట్ల ద్వారా మహిళలకు స్థిరమైన ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. వ్యాపారాల్లో మహిళలపై ఒత్తిడి తగ్గించేలా ప్రత్యేక ప్రణాళికతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నా రు. పాచిపని చేసుకునే మహిళ కూడా నేడు పారిశ్రామికవేత్తగా ఎదిగి కోట్ల రూపాయల టర్నోవర్ సాధిస్తోందని పేర్కొంటూ, మెప్మా మహిళలందరూ అలాంటి స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. వ్యాపారాల్లో రాజకీయాలను చొప్పించవద్దని, రిసోర్స్ పర్సన్లు నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా పనిచేయాలని సూచించారు. చిన్న వ్యాపారాలు నిర్వహిస్తున్న మహిళలను గుర్తించి ప్రోత్సహించా లని అధికారులకు ఆదేశించారు. మెప్మా మహిళల్లో అత్యధికులు నిరుపేదలేనని, తాను కూడా పేదరికం నుంచి వచ్చిన వ్యక్తినేనని మంత్రి గుర్తుచేశారు. వారి కష్టాలు తనకు తెలుసని, వారి ఆర్థికాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తూనే ఉంటానన్నారు. పిల్లలకు విద్యనే నిజమైన ఆస్తిగా అందించా లనే ఉద్దేశంతో నెల్లూరు నగరపాలక సంస్థ పరిధి లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కు 10 వేల సైకిళ్లను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. మెప్మా మహిళల వ్యాపారాభివృద్ధిపై ప్రతి నెలా సమీక్ష నిర్వహించి, లక్ష్యాల సాధనను పర్యవేక్షిస్తానని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్షలో మెప్మా ఏఎండి వెంకటేశ్వర్లు, పీడీ కిరణ్, మేయర్ దేవరకొండ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నేనున్నా ! బాధితులకు మంత్రి నారాయణ బరోసా !

- యనమలవారి వీధిలో కూలిన పాత ఇంటి స్లాబు
- ముగ్గురిని సురక్షితంగా బయటకు తీసిన రెస్క్యూ బృందం
- ఘటనాస్థలాన్ని పరిశీలించిన మంత్రి నారాయణ



**నెల్లూరు, జూలై 20, ప్రభాతవార్త – వైద్యం** నగరంలోని 49వ డివిజన్ యనమలవారి వీధిలో సోమవారం 60 ఏళ్ల నాటి పాత ఇంటి స్లాబు ఒక్కసారిగా కూలింది. శిథిలాల కింద చిక్కుకున్న ముగ్గురిని అగ్నిమాపక, రెస్క్యూ సిబ్బంది సమయస్ఫూర్తితో సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. సమాచారం అందుకున్న రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని కూలిన ఇంటిని పరిశీలించారు. బాధితులు, అధికారులు, స్థానికులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యలను పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూలిన ఇల్లు సుమారు 60 ఏళ్ల క్రితం నిర్మించిందని తెలిపారు. ఆ భవనంలో ఎనిమిది కుటుంబాలు నివాసం ఉంటున్నాయని చెప్పారు. శిథిలాల కింద చిక్కుకున్న ముగ్గురిని సురక్షితంగా బయటకు తీసుకురావడంలో సమయస్ఫూర్తితో వ్యవహరించిన అగ్నిమాపక శాఖ సిబ్బందిని అభినందించారు. బాధిత ఎనిమిది కుటుంబా లకు టిడ్కో ఇళ్ల మంజూ రు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఎవరు ఆపదలో ఉన్నా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని, బాధితులకు తక్షణ సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కమిషనర్ నందన్, మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జెడ్పిటిసి విజేతా రెడ్డి, 48వ డివిజన్ ప్రెసిడెంట్ బండి ప్రసాద్, కోక్లస్టర్ ఖాదర్ బాషా, క్లస్టర్ కప్పిరి శ్రీనివాసులు, రేవతి, ముజీబ్, గౌస్, మస్తానమ్మ, షబ్బీర్ స్థానిక టిడిపి నేతలు తదితరులు పాల్గొన్నారు.



## వేగవంతంగా అర్జీదారుల సమస్యలు పరిష్కరణ

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల - పరిష్కార వేదికకు 372 అర్జీలు



**నెల్లూరు, జూలై 20, ప్రభాతవార్త – కలెక్టరేట్** జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి తమ సమస్యలు పరిష్కారమవుతాయనే ఆశతో వచ్చే అర్జీదారుల పట్ల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లతో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, డీఆర్వో విజయకుమార్, ఐటిడీఏ ప్రాజెక్టు అధికారి శ్రీనివాసరావు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ నాగశేఖర్ తదితరులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా విచారణ నిర్వహించి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ, రీ ఓపెనింగ్‌కు ఆస్కారం లేకుండా నాణ్యతతో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ ను అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార కేంద్రాలు, పౌర సేవా కేంద్రాల్లో తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. ఫిర్యాదుదారులు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ సమస్యల పరిష్కారంపై ఫీడ్‌బ్యాక్ అందించేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రజల నుంచి అందే ఫీడ్‌బ్యాక్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించి సేవల నాణ్యతను మరింత మెరుగుపరిచే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ప్రత్యేక క్యూ లైన్లు, తాగునీటి సదుపాయం, ఉచిత భోజన ఏర్పాట్లు కల్పించింది. రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు, అర్జీదారులకు అవసరమైన ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టింది. వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**పరిష్కార వేదికగా 372 అర్జీలు** సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మొత్తం 372 అర్జీలు రాగా దాంట్లో రెవెన్యూ 178, ల్యాండ్ సర్వే 37, పోలీస్ 22, మునిసిపల్ 12 శాఖల మరిన్ని తదితర శాఖలు ఉన్నాయి.

## బుచ్చిలో బిజెపి జనతా వారధి



**బుచ్చి జులై 20 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలో భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా పి.వి.ఎన్ మాదవ్ ప్రజా సమస్యల పరిష్కారం కొరకు ఏర్పాటు చేసిన జనతావారధి కార్యక్రమంలో భాగంగా ఉదయం భారతీయ జనతా పార్టీ ఓబిసి మోర్చ తిరుపతి జిల్లా ఇంచార్జి మరియు జనతా వారది కార్యక్రమంలో కోవూరు నియోజకవర్గ కన్వీనర్ గంజం పెంచల ప్రసాద్ ఆద్వర్యంలో బుచ్చిరెడ్డిపాళెం మున్సిఫల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా,కమీషనర్ ఇనుమల చినబాబుకి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పెంచల ప్రసాద్ మాట్లాడుతు 20 వవార్డులో ,16 వార్డులో, 15 వవార్డులో పలు సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దృష్టికి కూడా ఈ సమస్యలు తీసుకొని వెళ్ళనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మైనార్టీ మోర్చ మాజీ జిల్లా ఉపాధ్యాక్షులు షేక్.ఖాదర్‌భాషా, దళితమోర్చ జిల్లా ఉపాధ్యాక్షులు గోళ్ళ నరసింహులు, మండల ఉపాధ్యాక్షులు మచ్చా కోటేశ్వరరావు, ఓబిసి నాయకులు నీలం వెంకటేశ్వర్లు, గిరిజన మోర్చ మండల అద్యక్షులు రాగి ప్రసాద్, నాయకులు దేవరకొండ ప్రసాద్, స్దానిక ప్రజలు కరిపిరెడ్డి కృష్ణారెడ్డి, శాకాపురం తిరుపతయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## కిలోమీటర్ కో పార్క్

- ప్రజలకు అందుబాటులోకి జిమ్ సైకిళ్లు
- అబ్దుల్ కలాం పార్క్‌ను సందర్శించిన మంత్రి, కలెక్టర్, కమిషనర్



**నెల్లూరు, జూలై 20, ప్రభాతవార్త – వైద్యం** నెల్లూరు నగర పరిధిలోని 48వ డివిజన్ అబ్దుల్ కలాం పార్క్‌ను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, కమిషనర్ నందన్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ ప్రజలతో కలిసి జిమ్‌లో పాల్గొనడమే కాకుండా, చిన్నపిల్లలను ఉయ్యాల ఊపుతూ వారితో సరదాగా గడిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నగరంలో ఇప్పటికే అభివృద్ధి చేసిన 48 పార్కులకు ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందని, ఆరోగ్యమే మహాభాగ్యం అనే సూత్రంతో సీఎం విజన్ 2047 – ఆరోగ్య ఆంధ్ర సాధన వైపు ఇది ఒక ముఖ్యమైన అడుగు అని స్పష్టం చేశారు. మంత్రి నారాయణ ఆలోచన మేరకు ప్రతి నివాస ప్రాంతానికి కేవలం 1 కిలోమీటరు పరిధిలోనే ఒక డీసెంట్రలైజ్డ్ పార్క్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, దీనివల్ల మహిళలు, వృద్ధులు ఇళ్లకు దగ్గరలోనే వ్యాయామం, వాకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. ప్రజల కోరిక మేరకు రాబోయే రోజుల్లో పార్కుల్లో మరిన్ని జిమ్ సైకిళ్లను కూడా అందుబాటులోకి తెస్తామని కలెక్టర్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మేయర్ దేవరకొండ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ జెడ్పిటిసి విజేత రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరపు సుబ్బారావు, 48వ డివిజన్ అధ్యక్షుడు పెంచలయ్య, 47వ డివిజన్ కార్పొరేటర్ పొట్లూరి రామకృష్ణ, విశ్వ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు జంగయ్య ఆచారి, గణేష్, గోపి, స్థానిక టిడిపి నేతలు తదితరులు పాల్గొన్నారు.

## వైసిపీ పాలనలో గ్రంధాలయ వ్యవస్థను నీరుగార్చింది

- ఉమ్మడి జిల్లా గ్రంధాలయ చైర్మన్ మేకపాటి శాంతికుమారి



**రాపూరు, జూలై 20, ప్రభాతవార్త** గత వైసిపి ప్రభుత్వం తన పాలనలో జిల్లాలోని గ్రంధాలయ వ్యవస్థను నీరుగార్చిందని ఉమ్మడి నెల్లూరు జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మేకపాటి శాంతి కుమారి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆమె రాపూరులోని ప్రభుత్వ గ్రంధాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె గ్రంధాలయంలోని పుస్తకాలు, రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాపూరులోని ఈ గ్రంధాలయం పూర్తిగా శిధిలావస్థకు చేరుకుందన్నారు. కనీసం రికార్డులు భద్రపరిచేందుకు కూడా అవకాశం లేదన్నారు. ఈ సారి తాను గ్రంధాలయం తనిఖీకి వచ్చే సమయంలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరితో గ్రంధాలయాన్ని సందర్శించి స్థానిక శాసనసభ్యులు సహకారంతో ఈ గ్రంధాలయాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం గ్రంధాలయా లను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. గ్రంధాలయ వ్యవస్థ అనేది సమాజానికి ఎంతో అవసరం అని దానిని సమాజానికి అవసరం లేని విధంగా చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనన్నారు. చదువుల తల్లి సరస్వతీ దేవి నిలయాలైన గ్రంధాలయాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నటువంటి ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలతో రాష్ట్ర ఐటి మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు నాయకత్వంలో గ్రంధాలయాల అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తున్నామని ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ప్రతి గ్రంధాలయాన్ని ప్రారంభించి ప్రస్తుత సమాజానికి అవసమైన విధంగా అబివృద్ధి చేసి గ్రంధాలయ సేవలు ఉమ్మడి నెల్లూరు జిల్లాలో విస్తృతం చేస్తామని ఆమె తెలిపారు. స్థానిక గ్రంధాలయాధికారి అంజయ్య తదితరులున్నారు.

## మీ ఆశీస్సులతోనే ఎమ్మెల్యేనయ్యాను





- ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

**కోట, జూలై 20 ప్రభాతవార్త** మీ అందరి ఆశీస్సులతోనే ఎమ్మెల్యేనయ్యానని గూడూరు శాసనసభ్యుడు డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఎంఆర్సీ భవనంలో కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని 225 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇండెక్స్ (కరెంట్ స్టౌ) స్టౌలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ 2024లో ఉద్యోగులు, అంగన్‌వాడీ టీచర్లు చూపిన ఆదరణ వల్లే తాను ఎమ్మెల్యేగా గెలిచానని చెప్పారు. అంగన్‌వాడీ పోస్టుల భర్తీలో తాను ఎవరి వద్ద ఒక్క పైసా కూడా తీసుకోలేదన్నారు. గత ప్రభుత్వంలో అంగన్‌వాడీ టీచర్ల పోస్టుల భర్తీకి డబ్బులు తీసుకున్నారని ఆరోపించారు. ఉద్యోగులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరిస్తుందని చెప్పారు. గత ప్రభుత్వం ఉపాధ్యాయులను బ్రాందీషాపుల వద్ద నిలబెట్టిందని, పాఠశాలల్లో బాత్‌రూంల వద్ద ఫొటోలు తీయించారని చెప్పారు. ఎన్‌డిఏ ప్రభుత్వానికి ఉద్యోగులంటే ఎంతో అభిమానమన్నారు. నియోజకవర్గంలో రామ్‌జీ పథకం ద్వారా నూతన అంగన్‌వాడీ భవనాలను నిర్మిస్తామని చెప్పారు. నాయకులు కూడా గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించాలని సూచించారు. ఈ ప్రాంతం రాబోయే రోజుల్లో పారిశ్రామిక నగరంగా మారుబోతుందని చెప్పారు. అటు దుగరాజపట్నం పోర్టు, ఇటు సాగరమాల రోడ్డు, కొత్తపట్నం ప్రాంతంలో క్రిస్ సిటీ, మరో నూతన కంపెనీ రాబోతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.జయజయరావు, ఎంపిడిఓ ఆర్.దిలీప్‌కుమార్, సిడిపిఓ మునికుమారి, చిల్లకూరు దశరథరామిరెడ్డి, పలగాటి భాస్కర్‌రెడ్డి, జలీల్ అహ్మద్, ఎఎంసి చైర్‌పర్సన్ దారా ప్రమీల, ఎం.సర్వోత్తమరెడ్డి, నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, మధు యాదవ్, నెల్లూరు మోహన్‌రెడ్డి, చెంగల్‌రావు, కిషోర్‌నాయుడు, మధురెడ్డి, ఎపిఎం అనిల, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి



**బిట్రగుంట జూలై 20 ప్రభాతవార్త** బోగోలు మండలం ముంగమూరు గ్రామం, ఎస్సీ కాలనీలో ఈ రోజు ఉదయం విద్యుత్ షాక్‌కు గురై ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. మృతుడు చేజర్ల యానాదయ్య (58) అని బిట్రగుంట ఎస్సై రామకృష్ణ తెలిపారు. ముంగమూరు గ్రామ ఎస్సీ కాలనీ నివాసి. ఉదయం సుమారు 06:30 గంటల సమయంలో తన ఇంటి ముందు ఉన్న ఆన్ చేసిఉన్న విద్యుత్ ప్రవాహం ఉన్న మోటారు ఇనుప పైపును ప్రమాదవశాత్తు తాకడంతో తీవ్ర విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఈ విషయం గమనించిన ఆయన భార్య కాంతమ్మ, కుమారుడు చేజర్ల పెంచల ప్రసాద్ మరియు స్థానిక గ్రామస్తులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, విధుల్లో ఉన్న వైద్యులు ఉదయం మృతి చెందినట్లు ధ్రువీకరించారు . అనంతరం మృతుని కుమారుడు చేజర్ల పెంచల ప్రసాద్ బిట్రగుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, బిట్రగుంట పి.ఎస్. నందు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## న్యాయం చేయడంటు మహిళ ఆందోళన

**జిల్లా ఎస్పి, ఎమ్మెల్యే ప్రశాంతమ్మ న్యాయం చేయాలంటు అభ్యర్థన**



**బుచ్చి జూలై 20 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం ఖాజానగర్‌లో అఫ్రిన్ అనే మహిళ తన కుటుంబసభ్యులతో కలిసి తన భర్త ఇంటి ముందు ఆందోళనకు దిగింది.ఈ సందర్బంగా ఆమె విలేఖర్లతో మాట్లాడుతు రసూల్‌భాషా అనే వ్యక్తి ఎస్ఐ అని చెప్పి మోసం చేసి 2107లో పెళ్ళి చేసుకొని తీరా కుమారుడు పుట్టిన తరువాత మొహం చాటేసి తనని రోడ్డుపాలు చేశాడని ఆమె కన్నీటి పర్యంతం అయింది. 2023లో కోర్టు భరణం ఇవ్వాలని ఆదేశించడం జరిగిందని కేవలం 3 నెలలు మాత్రమే ఇచ్చి తరువాత ఇవ్వకుండా వదలి వేశాడని ఆమె ఆందోళన వ్యక్తం చేసింది.2025లో ఆగష్టులో కోర్టులో విడాకుల కోసం డిస్మస్ చేసి ఇరువుర్ని జీవనం సాగించమని కోర్టు ఆదేశించినప్పటికి జీవనానికి తీసుకొని వెళ్ళకుండా రెండో పెళ్ళి చేసుకున్నాడని ఆమె ఆరోపించారు. ప్రస్తుతం నాకు ఏ దిక్కులేదంటు ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. జిల్లా ఎస్పి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తనకు న్యాయం చేయాలని కోర్టు ఆదేశించిన భరణం ఇప్పించాలని,పెళ్లి సమయంలో తీసుకున్న కట్నం డబ్బులు ఇప్పించాలని ఆమె కన్నీటి పర్యంతమైంది.బిడ్డతో సహా ఆందోళనకు దిగింది.

## గ్రంధాలయాలన్ని సద్వినియోగం చేసుకోండి

**చైర్మన్ మేకపాటి శాంతకుమారి**



**కలువాయి జులై 20 ప్రభాతవార్త :** గ్రంధాలయాలను ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్‌పర్సన్‌మేకపాటి శాంతకుమారి కోరారు. మండల లోని కుల్లూరు ,కలువాయి గ్రంధాలయాలను సోమవారం శాంతకుమారి సందర్శించారు.ఈ సందర్బంగా గ్రంధాలయం లోని పలు రికార్డులను గ్రంధాలయ పరిసరాలను పరిశీలిం చారు. అదే విధంగా కలువాయి గ్రంధాలయ అభివృద్దికి స్దానిక శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణతోపాటు దాతల సహకారంతో అభివృద్ది చేస్తామని ఆమె తెలిపారు.గ్రందాలయానికి వచ్చిన విద్యార్దులతో చైరపర్సన్ ఈ సందర్బంగా మాట్లాడారు. ఈకార్యక్రమంలో గ్రంధాలయాధికారి సుధాకర్, తదితరులు పాల్గోన్నారు.

## సాయి అపర్ణను ఆదర్శంగా తీసుకోవాలి



**కోవూరు, జూలై20ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశా లలో చదివి జిల్లా స్థాయిలో రెండవ స్థానం సాధిం చిన కోవూరులోని గుమ్మలదిబ్బ ఉన్నత పాఠశా లకు చెందిన పల్లా వెంకట సాయి అపర్ణను (594) విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా విద్యా శాఖ అధికారి డాక్టర్ బాలాజీ రావు అన్నారు. కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగిన షైనింగ్ స్టార్ అవార్డు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ద్వారా వచ్చిన 20 వేల చెక్కును , దీంతో పాటు మెమెంటో, సర్టిఫికేట్‌తో సాయి అపర్ణను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏపీసీ వెంకటసుబ్బయ్య, ఏఎంవో సుధీర్, డిప్యూటీ డీఈవో వెంకటేశ్వర నాయక్, తదితరులు ఉన్నారు.

## టీడీపీ నాయకుడు శ్యామ్ ఆకస్మిక మృతి

**- నివాళులర్పించిన టీడీపీ నేతలు**



**కోవూరు, జూలై20ప్రభాతవార్త :** కోవూరులోని పెళ్లకూరు కాలనీకి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, 120వ బూత్ కన్వీనర్ పాలపర్తి శ్యామ్ ఆకస్మికంగా మృతిచె ందారు. ఈ మేరకు మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డిలు శ్యామ్ నివాసానికి చేరుకుని పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు స్వయంగా శ్యామ్ మృతదేహానికి కన్నీళ్లతో నివాళులర్పించి పాడె మోసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు ఉన్నారు.

## పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలి



**కోవూరు, జూలై20ప్రభాతవార్త :** ప్రతి విద్యార్థి ప్రాథమిక దశ నుంచి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలని సబ్ యూనిట్ ఆఫీసర్ నాగరాజు తెలిపారు. డెంగ్యూ నివారణ మాసోత్స వాల్లో భాగంగా ఎన్ఎస్ఆర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రస్తుతం రానున్న వర్షా కాలం పురస్కరించుకుని డెంగ్యూ వ్యాది పట్ల అవగా హన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాధి సోకిన వారికి తీవ్రమైన జ్వరం కండరాల్లో భరించరాని నొప్పి తదితర వాటితో ప్రారంభం అవుతుందన్నారు. సరైన చికిత్స తీసుకోకపోతే ప్రాణాంతకంగా మారుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రజలు ఇళ్లల్లో నీరు నిల్వ లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. మానవహారం ఏర్పాటు చేసి విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ప్రధానోపాధ్యాయులు సీహెచ్ ప్రసాద్; ఉపా ధ్యాయులు నీరజ, సుబ్బారావు, ఉమా మహేశ్వరరావు, ఆరోగ్య సహాయకులు సురేష్, తదితరులు ఉన్నారు.

## మోటార్ సైకిళ్లు ఢీ.. యువకుడు దుర్మరణం



**కోవూరు, జూలై20ప్రభాతవార్త :** కోవూరు సమీపంలోని సాలుచింతల ప్రాంతంలో ఉన్న పుష్ప వైన్స్ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో ఎదురెదురుగా వస్తున్న రెండు మోటార్ సైకిళ్లు ఢీకొన్న సంఘటనలో నేతాజీనగర్‌కు చెందిన ఎస్‌కే మునీర్ బాషా తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. నెల్లూరు నుంచి కోవూరు వైపు వెళ్తున్న మోటార్ సైకిల్, కోవూరు నుంచి నెల్లూరు వెళ్తున్న మరో మోటార్ సైకిల్ ఢీకొన్నాయి. ఈ సంఘటనలో మునీర్ బాషా అక్కడికక్కడే మృతిచెందగా.. మరో వ్యక్తికి తేలికపాటి గాయాలయ్యాయి. మృతిచెందిన మునీర్ బాషా నెల్లూరులోని బార్‌కాస్ సెంటర్‌లో సైకిల్ మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆస్పత్రిలో మునీర్ బాషా మృతదేహంపై పడి కుటుంబ సభ్యులు రోధిస్తున్న తీరు చూపరులను కలిచివేసింది. ఈ మేరకు ఎస్సై ముత్యాలరావు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేస్తున్నారు.

## నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి



**కోవూరు, జూలై 20 ప్రభాతవార్త :** డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలని ఎంఈవో-2 వై. చెంచులక్ష్మమ్మ అన్నారు. కోవూరు మండలంలోనిఇనమడుగు ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని సోమ వారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ను తప్పక అమలు చేయడమే కాకుండా పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకునేలా మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సి న బలవర్ధకమైన పౌష్టికాహారం అందిస్తున్నారని తల్లిదండ్రులు కూడా తమ బిడ్డలు పాఠశాలల్లో తినేలా సహకరించాలన్నారు. ఈ సందర్భంగా ఏజెన్సీ లకు పలు సూచనలు చేశారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం



**గూడూరు రూరల్, జూలై 20, ప్రభాతవార్త :** గూడూరు రూరల్ పరిధిలోని చెన్నూరు గ్రామంలో నివసిస్తున్న కటికాల వెంకటరమణయ్య శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. వాళ్లని నిరుపేదలుగా గుర్తించిన నెల్లూరు జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం మట్టి ఖర్చులు నిమిత్తం అంతిమయాత్ర పథకం కింద ఐదు వేలు రూపాయలు ఆర్థిక సహాయం అందజేసారు. వారి కుటుంబ సభ్యులు సంఘంలోని దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కటికాల శేషు కార్యవర్గ సభ్యులు మదిర బాలయ్య, చెన్నూరు దేవాంగ కమిటీ సభ్యులు మన్నె రమణయ్య, ఆకాశం బాల గురవయ్య, చల్లా వెంకటేశ్వర్లు కటకాల హరి, జగన్, కామాక్షయ్య, చలమయ్య, సుబ్బయ్య, మధిర సునీల్, మాదన లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## విచారణ మధ్యలో గంధరగోళం



**కోవూరు, జూలై20ప్రభాతవార్త :** కోవూరులోని ఐసీడీఎస్ కార్యాలయంలో పనిచేస్తున్న సీడీపీవో శారదపై అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సభ్యులు సీఐటీయూ ఆధ్వర్యంలో ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనాసుజన్ కోవూరు ప్రాజెక్టు నందు విచారణ చేపట్టేందుకు వచ్చారు.ఈ విచారణ ప్రారంభం కాక మునుపే సీఐటీయూ యూనియన్, సీడీపీవో మధ్య గంధరగోళం ఏర్పడడంతో విచారణ మధ్యలో ఆగింది. అనంతరం ఈ విచారణ సంబంధించి సీడీపీవో వద్ద, అంగన్‌వాడీ వర్కర్స్ వద్ద, అసోసియేషన్ నేతల వద్ద వినతిపత్రం రూపంలో అర్జీలు స్వీకరించారు. దీనిని పూర్తి చేసి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని పీడీ తెలిపారు.

## ఆయుష్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, జూలై 20 ప్రభాతవార్త :** ఆయుష్ శాఖ ద్వారా అనేక రకాల మొండి రోగాలు నయం చేసే మందులు ఉన్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని ఆయుష్ శిబిరాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఇనమడుగు హోమియో వైద్యులు కరుణాకర్, తెలిపారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం ఇనమడుగు హోమియో వైద్యులు డాక్టర్ కరుణాకర్ ఆధ్వర్యంలో హోమియో వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా పీజీఆర్ఎస్‌లో వినతిపత్రాలు ఇవ్వడానికి వచ్చిన వారికి ఆరోగ్య పరీక్షలు, షుగర్ పరీక్షలు నిర్వహించి రిపోర్టులు అందజేశారు. హోమియోలో మొండి రోగాలను సైతం నయం చేసే మందులు ఉన్నాయని, వాటిని వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.. కరోనా వ్యాధి విషయంలో కూడా ఆయుష్ శాఖ మంచి వైద్యం అందించిందన్నారు. బీపీ , షుగర్, చర్మ వ్యాధులు, తదితర వ్యాధులతో బాధపడే వారు ఈ శిబిరాలను ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోహోమియో ఉద్యోగులు , రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

## రైతులు ఫసల్ భీమాపై అవగాహన పెంచుకోవాలి



**కోవూరు, జూలై20ప్రభాతవార్త :కోవూరు** వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని కోవూరు, కొడవలూరు, బుచ్చిరెడ్డిపాలెం మండలాల్లో ఉన్న రైతులు ఫసల్ బీమాపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు అనిత అన్నారు. కోవూరులోని కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 60 వేల ఎకరాల్లో వరి, 2300 ఎకరాల్లో వేరుశెనగను రైతులు సాగు చేశారన్నారు. ఇటీవల కురిసిన వర్షాల వలన రైతులకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. వరిలో అక్కడక్కడ నల్లి ఉధృతి ఉందని, వాతావరణ మార్పు వలన క్రమంగా ఇది నియంత్రణలోకి వస్తుందన్నారు. ప్రకృతి వైపరీత్యం వలన పంట నష్టం జరిగితే రైతులను ఆదుకునేందుకు ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం అందుబాటులో ఉందన్నారు. ఈ పథకం కింద ఎకరానికి వరి పంటకు 840 రూపాయలు, వేరుశెనగ పంటకు 280 రూపాయల చొప్పున రైతులు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. బ్యాంకుల నుంచి పంట రుణాలు తీసుకున్న రైతుల ప్రీమియం మొత్తాన్ని బ్యాంకర్లే నేరుగా మినహాయిస్తారన్నారు. పంట రుణం తీసుకోని రైతులు, కౌలు రైతులు , గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద ఉండే స్వయం ధృవీకరణ పత్రం పూర్తి చేసి కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా ప్రీమియం చెల్లించి బీమా నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ పథకంలో చేరేందుకు రైతులు వేరుశెనగ పంటకు జులై 31వ తేది వరి పంటకు ఆగస్టు 15వ తేది లోగా ప్రీమియం చెల్లించి ఈ పంటలో కూడా నమోదు చేసుకోవాలని సూచించారు.

## షైనింగ్ స్టార్ అవార్డులు అందుకున్న 6గురు విద్యార్ధులు



**రాపూరు, జూలై 20, ప్రభాతవార్త :** పదవ తరగతి పలితా ల్లో ఉత్తమ పలితాలు సాధించిన రాపూరు మండలంలోని 6గురు విద్యార్థులకు సోమవారం నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో రాష్ట ప్రభుత్వం షైనింగ్ స్టార్ అవార్డులను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, రాష్ట పురపాలక శాఖా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ,జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ ఆనం అరుణమ్మ, జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీరావు చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.రాపూరులోని జెమ్స్ ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థినీ బండి కావ్య ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా రూ.20 వేల నగదు బహుమతితో పాటు, చిరు సత్కారం అందుకున్నారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థినీ పదవ తరగతి పలితాల్లో మంచి మార్కులు సాధించి అవార్డు అందుకోవడం అభినందనీయమని జెమ్స్ పాఠశాల కరస్పాండెంట్ బులగాకుల మునీంద్రా రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా అవార్డు అందుకునన కావ్యను పలువురు అభినందించారు.

## రెవెన్యూ అధికారుల వలనే దళిత గిరిజనులు భూములు కోల్పోతున్నారు



**కావలి, జూలై 20 ప్రభాతవార్త :** కావలి రెవెన్యూ అధికా రుల వల్ల దళితులు, గిరిజనులు భూములు కోల్పోతు న్నారని దళిత సంఘర్షన సమితి జిల్లా అధ్యక్షులు మల్లి పేర్కొన్నారు. ప్రజా విజ్ఞప్తుల దినోత్సవం సందర్బంగా మల్లి ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం ఇచ్చారు. దళితులు, గిరిజనులకు ఇచ్చిన భూములను ఇతర బడగు, బలహీన వర్గాలకు చెందిన భూములకు సరైన రికార్డులు లేకపోవడం వల్ల ప్రభుత్వ రాయితీలు పొందడానికి రెవెన్యూ అధికారులు సహకరించకపోవడంతో బ్యాంకుల రుణ సౌకర్యం కల్పించలేకపోవడం జరుగుతోందన్నారు. 1989లోసిజెఎప్ఎస్ పథకం కింద 23ఎకరాల భూమి అరుందతీయులకు మనిషికి ఒక ఎకరా చొప్పున ఇచ్చారని తెలిపరు. రికార్డుల్లో మాత్రం నమోదు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చెన్నారెడ్డిపాలెంలో 874సర్వేనెంబర్ నుంచి 333/23 కొత్త సర్వేనెంబర్ వరకు ఇచ్చిన భూములు చేరెడ్డి సుబ్బరామిరెడ్డి తన సొంతపేరుమీద రాసుకొంటున్నారని తెలిపారు. రియల్ ఎస్టేట్ భూములకు కాకుండా ఇతర వ్యాపార సంస్థలకు గ్రావెల్‌ను తరలించడానికి తహశీల్దార్ సహకారం ఎంతో ఉందన్నారు. పేదలకు దక్కాల్సి న భూములు మండలంలో ఒక్క ఎకరా లేకుండా చేస్తున్నారని తెలిపారు. దీపిఐ సమగ్ర విచారణ జరిపి ఇందకు బాధ్యులపై కఠినంగా శిక్షించాలని కోరారు. ఈకార్యక్రమంలో కుమారమ్మ, నరసింహం, మోహన్‌రావు, డానియల్ తాల్లూరి ఏకోలు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి డాక్టర్ హీలీమౌలాలి



**కావలి, జూలై 20 ప్రభాతవార్త :** రానున్నది వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కావలి ఏరియా వైద్యశాల ఆయుర్వేద వైద్యులు డాక్టర్ హోలి మౌలాలి కోరారు. ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా విజ్ఞప్తుల దినత్సవం సందర్బంగా స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు మౌలాలి, కలిగిరి మండలం సిద్దనకొండూరు ఆయుర్వేద డాక్టర్ రోహిలు పాల్గొని సీజనల్ వ్యాదులపై ప్రజలకు అవగాహన కల్పించి పలు సూచనలు,సలహాలు ఇచ్చారు. రోగులను పరిశీలించి ఉచితంగా మందులను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎన్ఓ సుబ్బారెడ్డి, ఓఎస్ దీప్తి, లోకస్‌సత్తా నాయకులు మాలకొండరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## సామాజిక శంఖారావం సర్వే



**కావలి, జూలై 20 ప్రభాతవార్త :** స్థానిక 36వ వార్డు వైకుంతపురం చెరువుకట్ట సంఘంలో సామాజిక శంఖారావం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కులవివక్ష, వ్యతిరేక పోరాట సంఘం ఏపి వ్యవసాయ కార్మిక సంఘంచే సర్వే చేశారు. కుల వివక్షతను నిర్మూలించి సాంఘీక సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. కాలనీలోని మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, వీధిలైట్లు వెలగడం లేదని సరైన రోడ్డు సౌకర్యం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం.మోహనరావు, సిఐటియు పట్టణ ఉపాధ్యక్షులు పెంచలయ్య, గిరిజన సంఘం నాయకులు మేడ వెంకటేశ్వర్లు, కెవిపిఎస్ నాయకులు పత్రి మాలకొండయ్య, శామ్యూల్, ఐద్వా నాయకులు అరుణ, రత్నమ్మ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## పేడ దిబ్బ పై కొక్కుపాడులో అధికారుల విచారణ



**కోట,జులై 20 ప్రభాతవార్త** కొక్కుపాడు గ్రామ పంచాయ తీలో శ్రీనివాసు లురెడ్డి అనే రైతు తన ఇంటి పక్కన పెడ దిబ్బ వేశారని దీంతో తాము దుర్గంధమైన వాసనతో ఇబ్బం దులు పడుతున్నాని ఆరైతు డిడిఓకి పిర్యాదు చేశారు. ఈ క్రమంలో సోమవారం డిడిఓ వాణిరెడ్డి, తహిసీల్దార్, కె.జ యజయరావు,ఎంపిడివో ఆర్. దిలీప్‌కుమార్, ఆర్డబ్ల్యుఎస్,ఎఇ సుమన్‌రెడ్డి, వైద్యధికారులు వేళ్లి క్షేత్రస్దాయిలో విచారణ జరిపారు.

## రాజ్యసభలో బిఎంఆర్ అడిగిన ప్రశ్నకు దేశంలోని ప్రతి గ్రామీణ కుటుంబానికి కుళాయినీరు



**కావలి, జులై 20 ప్రభాతవార్త :** రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు యాదవ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సమాదానమిస్తూ జలజీవన్ విషన్ 2.0 డిసెంబర్ 2028 వరకు పొడిగించి ప్రతి గ్రామీణ కుటుంబానికి కుళాయి నీరు అందజేయడం జరుగుతుందని ప్రకటించారు. దేశంలో ఈ పథకంచే రూ.19.36కోట్లు గ్రామీణులకు సురక్షితమైన తాగునీటిని కుళాయి ద్వారా అందించడమే లక్ష్యమని తెలిపారు. జలజీవన్ 2.0కింద మొత్తం వ్యయాన్ని రూ.3.60లక్షల కోట్ల నుంచి రూ.8.69 లక్షల కోట్లకు పెంచినట్లు తెలిపారు. సుజలం భారత్ అనే జాతీయ డిజిటల్ ప్లాట్‌ఫారం, గ్రామాల వారీగా ప్రత్యేక సర్వీస్ ఏరియా ఐడిలు నీటివనరుల స్తిరత్వం, గ్రామ పంచాయితీల భాగస్వామ్యం వంటి కీలక సంస్కరణలను అమలు చేయనున్నట్లు వివరించారు. నీటిసరఫరా వ్యవస్థల నిర్వహణను గ్రామ పంచాయితీలకు అప్పగించడం, డిజిటల్ పర్యవేక్షణ నీటి వనరుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. 2026-27 ఏడాదికి ఏపికు రూ.2,631.07కోట్లు తాత్కాళిక కేటాయింఉ చేసినట్లు ఇప్పటి వరకు రూ.27,15కోట్లు కేంద్రం వాటా విడుదల చేసినట్లు సమాధానంలో వెల్లడించింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించడం, నీటి వనరులను దీర్ఘకాలికంగా పరిరక్షించడం ప్రజల బాగస్వామ్యంతో నీటినిర్వహణ మరింత సమర్ధవంతంగా అమలు చేయడమే జల్‌జీవన్ మిషన్ 2.0 ప్రధాన లక్ష్యమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

## ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్స్ సమస్యల పరిష్కారం పై బీదకు వినతి



**నెల్లూరు, జూలై 20, ప్రభాతవార్త - కలెక్టరేట్ :** రాష్ట్ర జేఏసీ చైర్మన్ అలపర్తి. విద్యాసాగర, సెక్రెటరీ జనరల్ కెఎస్ఎస్ ప్రసాద్ పిలుపు మేరకు ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్స్ యొక్క సమస్యల పరిష్కారం కై నెల్లూరు జిల్లా ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల సంయుక్త కార్యచరణ కమిటీ వారి దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరణ నిమిత్తం శాసన మండలి సభ్యులు బీద రవిచంద్రకు వినతి పత్రం సమర్పించారు. నెల్లూరు జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ బండారుపల్లి వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ అల్లంపాటి సురేంద్ర రెడ్డి నాయకత్వంలో సభ్య సంఘాల నాయకులు అందరు శాసన మండలి సభ్యులు బీదా రవిచంద్రని కలిసి దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ, ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేయవలసినదిగా కోరారు. ఈ సందర్భంగా గత 3 సంవత్సరాలుగా పెండింగులో ఉన్న వేతన సవరణ, సరెండర్ లీవుల చెల్లింపు, 4 కరవు భత్యాల విడుదల, ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష మినహాయింపు, సీపీఎస్ రద్దు, తదితర 10 అంశాలతో కూడిన వినతి పత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా జేఏసీ నాయకులు దశరధ రామయ్య (ఏపిటిఎఫ్ 257)పి. కిరణ్ కుమార్ (ట్రెజరీ శాఖ), కె.రాజేంద్ర ప్రసాద్ (ఎడ్యుకేషన్), లక్కాకుల పెంచలయ్య పంచాయతీ రాజ్, రామకృష్ణ జేఏసి ఆర్గనైజింగ్ సెక్రటరీ, కె. వెంకటేశ్వర్లు (ఏపిఏఒ) ఎన్. ఆంజనేయ వర్మ (మెడికల్), ఎన్.రాజేంద్ర (అగ్రికల్చర్), సతీష్ బాబు ఏపిఎన్‌జిఒస్, గురవయ్య ఏపిటిఎఫ్ 1938 మహిళా విభాగం ఛైర్పర్సన్ ఎల్. నవోదయ, కన్వీనర్ జి. లక్ష్మి, అంజనా దేవి, నెల్లూరు నగర సభ్యులు జానకి వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అర్జీ ఇస్తే.. పరిష్కారం చూపాల్సిందే!



**కొడవలూరు, జూలై 20 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై అర్జీలను తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డికి అందజేశారు.ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకే ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేసిందన్నారు. భూ సంబంధిత, రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీలను పరిశీలించి సంబంధిత అధికారులకు పంపి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి అర్జీని ప్రాధాన్యంగా తీసుకుని నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించామని, మిగిలిన వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు.ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి సత్వర పరిష్కారం చూపాలని సూచించారు. అనంతరం వీఆర్వోలు, కార్యాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. మండలంలోని రెవెన్యూ అంశాలు, పెండింగ్ అర్జీలు, భూ సమస్యల పరిష్కారంపై సమీక్షి ంచి తగిన సూచనలు చేశారు.కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఇ.సాయి చందు, సీనియర్ అసిస్టెంట్ మస్తాన్ బాబు, జూనియర్ అసిస్టెంట్లు అశ్విన్, ప్రసన్న, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## డిప్యూటీ తహశీల్దార్‌కు సన్మానం



**కొడవలూరు, జూలై 20 ప్రభాతవార్త:** కొడవలూరు మండల తహశీల్దార్ కార్యాలయంలో నూతనంగా డిప్యూటీ తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఈ. సాయి చందును తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు శాలువాలతో సన్మానించి అభినంది ంచారు. ఈ కార్యక్రమంలో సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు మస్తాన్ బాబు, అశ్విన్, ప్రసన్నతో పాటు వీఆర్వోలు ఎన్. శ్రీనివాసులు, షేక్ షరీఫ్, ఏడుకొండలు, సుబ్బయ్య, సిహెచ్. వెంకటేశ్వర్లు, యు. సురేష్, ప్రసాద్, సురేష్, మల్లికార్జున్, సుబ్రహ్మ ణ్యం, రమేష్, మురళీధర్, దేశన్న, ఎస్.కె. బాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కొడవలూరు డిప్యూటీ తహశీల్దార్‌గా సాయి చందు



**కొడవలూరు, జూలై 20 ప్రభాతవార్త:** మండల తహశీల్దార్ కార్యాలయ డిప్యూటీ తహశీల్దార్‌గా ఈ. సాయి చందు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయం నుంచి డిప్యూటేషన్‌పై ఆయన కొడవలూరుకు వచ్చారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి సాయి చందుకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యాలయ సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

## జీవో నెం.396 రద్దు చేయాలని నిరసన



**గూడూరు, జూలై 20, ప్రభాతవార్త :** గూడూరు పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్లు, సహాయకులు, డిటిపి ఆపరేటర్లు, స్టాంప్ వెండర్లు నిరసన తెలియచేశారు. ఈ సందర్భంగా సీనియర్ డాక్యుమెంట్ రైటర్ రాయసం సుబ్బారావు, బూడిదవాక వెంకటరత్నం ఆచారిలు మాట్లాడుతూ దస్తావేజుల తయారీ విధానాన్ని రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలకు అప్పగించే జీవో నెంబర్ 396ను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. తమ జీవనోపాధిని కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ నెల 31వ తేదీ వరకు నిరవధిక నిరసన కార్యక్రమం చేపడుతామన్నారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ నంద కిషోర్‌కి వినతి పత్రం ఆనందచేశారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు, సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి సిబ్బందికి విద్యుత్ స్టవ్వు పంపిణీ



**చిల్లకూరు, జూలై 20, ప్రభాతవార్త :** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తుపాకుల వెంకట రమణ చేతుల మీదగా మండలంలోని 85 అంగన్వాడి సెంటర్లకు విద్యుత్ స్టవ్‌లను పంపిణీ చేసారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంక్షేమ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నారని రాబోయే రోజుల్లో అంగన్వాడి సెంటర్‌లో చదువుతున్న చిన్నారులకి అనేక వసతులతో కూడిన ఆహారంతో పాటు విద్యని అందిస్తున్నారు ఎక్కడ లేని విధంగా ఈరోజు మన రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని వారు తెలిపారు.మండల పార్టీ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, ఇన్చార్జి ఎంపీడీవో వెంకటరావు, సిడిపిఓ మహబూబ్, నాయకులు ఒడూరు సత్యనారాయణ రెడ్డి, కొండా రామచంద్ర రెడ్డి,సూరనేని రామచంద్రరావు, చిట్టేటి నారాయణ, మరి కొంత మంది నాయకులు, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా - ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్



**కోట, జూలై 20 ప్రభాతవార్త** అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సమస్యలను పరిష్క రించాలని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌ను కోరారు. సోమవారం కోట లోని ఎంఆర్‌సి భవనంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు కరెంట్ స్టౌలను పంపిణీ చేయడానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్బంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభుత్వం అమలు చేస్తున్న యాప్‌ను రద్దు చేయాలని కోరారు. యాప్ వలన అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నామని, సర్వర్లు పనిచేయక మానసికంగా ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. దీంతో తాను ప్రభుత్వంతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## పట్టపు గ్రామాలలో దురాయి సాంప్రదాయాన్ని నిషేధించాలి



**నెల్లూరు, జూలై 20, ప్రభాతవార్త – కలెక్టరేట్ :** మత్స్యకార గ్రామాలలో కుల పెద్దల ముసుగులో దౌర్జన్యాలు దాడులు నిర్బంధించడాలును నివారించాలని, బాధితులతో కలిసి తీర ప్రాంత సాంప్రదాయ మత్స్యకార పరిరక్షణ సమితి నాయకుల ధర్నా నిర్వహించారు. తమిళనాడుకు చెందిన ఫిషింగ్ బోట్లో మాయం విషయంలో తోటయ్య కొండూరు శెట్టి ఊటుకూరు జాలయ్య తదితర కుటుంబాలను అక్రమంగా నిర్బంధించారు. అర్ధ నగ్నంగా తాళ్లతో బంధించి గుంపులుగా దాడి చేసి రక్త గాయాలతో హత్యాయత్నం చేసి జీవించే హక్కును కుల పెద్దలు కాలరాశారని, దురాయిని ప్రభుత్వం వెంటనే నిషేధించాలని పరిరక్షణ సమితి ఫౌండర్ ప్రెసిడెంట్ వి. చిట్టిబాబు, బీసీవై పార్టీ నేత యనమల నాగేశ్వరరావు డిమాండ్ చేశారని, ఒక్కొక్కరికి రెండు గ్రామాలలో పర్యాయాలు 90 లక్షల చొప్పున జరిమానాలు విధించారు. ఒక్కొక్కరు 40 లక్షల వరకు జరిమానాలు చెల్లించారు. మిగిలిన డబ్బులు కోసం బాధ్యత కుటుంబాలను ధ్వంసం చేసి దోపిడీ చేసి ఆస్తులు స్వాధీనపరచుకొన్నారు. బాధితులను గ్రామ బహిష్కరణ చేశారు. కట్టు బట్టలతో ఎక్కడో దూరంగా బంధువుల ఇళ్లలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవిస్తున్నారు. రాజ్యాంగబద్ధమైన ప్రభుత్వానికి పోటీగా చట్టాలను తమ చేతిలోకి తీసుకొని సమాంతర ప్రభుత్వాలను మత్సకార గ్రామాలలో కుల పెద్దలు నిర్వహిస్తున్నారు. కుల పెద్దలు ముసుగులో వైట్ కాలర్ నేరగాళ్లుగా సామ్రాజ్యం ఏలుతున్న వారిపై క్రిమినల్ చర్యలు రౌడీ షీట్లు పీడీ యాక్ట్లు నమోదు చేయాలని చిట్టిబాబు, నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసివై పార్టీ నేత సోమ గోపాల్, బిజెపి నేతలు విడతల రమేష్. రఘురామయ్య, నాగేంద్ర సింగ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తాం

**– జిల్లా ఎస్పి డా. అజిత వెజెండ్ల**



**నెల్లూరు క్రైమ్, జూలై 20, ప్రభాతవార్త :** ప్రజా సమస్యలను సత్వరంగా పరిష్కరించడంతో పాటు, ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా విచారించి న్యాయం చేయాలని ప్రజా వినతులు పునరావృతం కాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పి అజిత వేజెండ్ల సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఇతర అధికారుల సమక్షంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి 161 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజా ఫిర్యాదుల పట్ల ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదన్నారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా, జవాబుదారీతనంతో వ్యవహరించాలన్నారు. ప్రతి పిటిషన్‌ను సమగ్రంగా విచారించి త్వరితగతిన పరిష్కరించాలని, బాధితులకు చట్టపరమైన న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా పోలీస్ అధికారులకు సూచనలు ఇచ్చారు. దర్గామిట్ట పోలీస్ స్టేషన్ పరిధికీ చెందిన పిర్యాది దగ్గర కృష్ణ జిల్లా ఉయ్యూరుకు చెందిన మహమ్మద్ హాసన్ బాషా, అతని తండ్రి షరీఫ్‌లు 2018 మోడల్ కారుని ఇప్పిస్తానని రూ. 33,50,000 తీసుకొని రెండేళ్ల నుంచి ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు సదరు విషయం పై విచారించి న్యాయం చేయమని పిర్యాది కోరారు. వింజమూరు పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన పిర్యాది, తను వృధాప్యంలో ఉన్నట్టు, తన పెద్ద కుమారుడు శ్రీనివాస్ రెడ్డి తరచు వేదిస్తూ ఇళ్ళు కాలిచేసి వెళ్ళమని ఇబ్బందులకు గురిచేస్తునట్టు సదరు విషయం పై విచారించి న్యాయం చేయమని పిర్యాది కోరారు. బుచ్చి పోలీస్ స్టేషన్ పరిధికీ చెందిన పిర్యాది, తన భర్తను 2025లో హత్య చేసినట్టు ఆ కేసులో లోతుగా దర్యాప్తు జరిపించి దానికి కారకులైన వారిపై తగిన చర్యల కొరకు పిర్యాదు చేశారు. వేదాయపాలెం పోలీస్ స్టేషన్‌కు చెందిన పిర్యాది, తన భర్త, అత్తమామలు కుటుంబ విషయాల పై మానసికంగా శారీరకంగా వేదిస్తునట్టు, విచారించి న్యాయం చేయమని పిర్యాది కోరారు. దర్గామిట్ట పోలీస్ స్టేషన్‌కు చెందిన పిర్యాది, తను రిటైర్డ్ ఉద్యోగి అని, తన కోడలు కొడుకులకు ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి 2021లో ఇందుకూరుపేట చింతోపు గ్రామానికి చెందిన పందిటి. పోలయ్య ద్వారా పరిచయమైన ఒక పాత్రికేయుడు తన వద్ద రూ. 7,40,000 తీసుకొని ఉద్యోగాలు ఇప్పించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు, అడిగితే బెదిరిస్తున్నట్టు, సదరు విషయమై విచారించి చర్యల కొరకు పిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి అడ్మిన్ సిహెచ్ సౌజన్య, ఉమెన్ పోలీస్ స్టేషన్ డిఎస్పీ వేమారెడ్డి, సీఐ సుబ్బారావు, పిసిఆర్ సీఐ భక్తవత్సల్ రెడ్డి, ఎస్బి 1 సీఐ దశరద రామారావు, ఎస్బి 2 సీఐ శ్రీనివాసులు రెడ్డి, పీజీఆర్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉన్నత పాఠశాలకు వాటర్ కూలర్ బహుకరణ



**తోటపల్లి గూడూరు, జూలై 20, ప్రభాతవార్త :** మండలంలోని వరిగొండ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్థానిక టీడీపీ నాయకులు, విజ య డైరీ డైరెక్టర్ కోడూరు శ్రీనివాసుల రెడ్డి (చిన్న బాబు రెడ్డి) సోమవారం వాటర్ కూలర్‌ను బహూ కరించారు. ఈ సందర్భంగా పాఠ శాల ఉపాధ్యా యులు మాట్లాడుతూ తమ విజ్ఞప్తికి వెంటనే స్పంది ంచి వాటర్ కూలర్‌ను అందించిన చిన్నబాబు రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఆయన కృషితో పాఠశాలకు ప్లే గ్రౌండ్ ప్రహరీ నిర్మాణం, మొక్కల నాటకం, ఇతర మౌలిక వసతుల కల్పన వంటి అభివృద్ధి పనులు కూడా జరిగాయని పేర్కొన్నారు. ఈ పనులకు సహకరించిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, చిన్నబాబు రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం చిన్నబాబు రెడ్డి మాట్లాడుతూ, తాను ఇదే పాఠశాలలో విద్యార్థిగా చదువుకున్నానని, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సహకారంతో విద్యార్థుల అవసరాలను గుర్తించి వాటర్ కూలర్‌ను అందించినట్లు తెలిపారు. వరిగొండ ప్రాథమిక పాఠశాల, గమల్లపాలెం పాఠశాలలకు కూడా వాటర్ కూలర్లు అందించినట్లు వెల్లడించారు. గ్రామాభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను పూర్తి చేసినట్లు చెప్పారు. జ్వాలాముఖి అమ్మవారి దేవస్థానం అభివృద్ధికి కూడా ఛైర్‌పర్సన్ కోడూరు రాజేశ్వరి ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన వసతులు కల్పిస్తూ ఆలయాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. గ్రామాభివృద్ధి, ప్రజా సేవలో నిరంతరం కృషి చేస్తున్న చిన్నబాబు రెడ్డి సేవలను స్థానిక ప్రజలు అభినందించారు.

## భూ ఆక్రమణలపై స్పందన లేదని గ్రామస్తుల ఆరోపణ



**వింజమూరు, జూలై 20, ప్రభాతవార్త :** భూ ఆక్రమణలపై ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించడంలేదని కాటేపల్లి గ్రామస్తులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం వింజ మూరు తహసిల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. మండలంలోని కాటేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ, పంచాయతీ భూములను కొందరు ఆక్రమిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు అర్జీలు సమర్పించినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. గ్రామంలోని స్మశానం, కుంటలు, పబ్లిక్ పర్పస్ స్థలాలు కూడా ఆక్రమణకు గురవుతున్నాయని ఆరోపించారు. అక్రమంగా ఆక్రమించిన భూముల్లో కొందరు ఇళ్లు నిర్మించుకుంటున్నారని, పంటలు వేస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై వెంటనే రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి, ఆక్రమణలను తొలగించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా శార్వాణి కాలనీలో కేవలం 5 నివాస గృహాలు మాత్రమే ఉండగా అవసరానికి మించి బోరులు వేసి పంచాయతీ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. 144 సెక్షన్ ఉన్న పోరంబోకు భూమిలో కూడా బోరు వేయడం వల్ల సమస్యలు మరింత జటిలమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ కొందరు ప్రభావితులు అక్రమ బోరుల ద్వారా నీటిని వృథా చేస్తున్నారని, దీనివల్ల పేదలకు నీరు అందడం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి భూ ఆక్రమణలను నిరోధించి, ప్రభుత్వ భూములను కాపాడాలని, నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

## హత్యా రాజకీయాలకు ఆజ్యం పోస్తున్న మాజీ ఎమ్మెల్యే
## వాసు హత్యపై టిడిపి దళిత గిరిజన నేతలు ఫైర్



**కావలి, జూలై 20 ప్రభాతవార్త :** నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి హత్యా రాజకీయాలకు ఆద్యంపోస్తూ దళితుల మధ్య చిచ్చు పెడుతూ చాట్లవాసు మృతికి కారకులయ్యారని పట్టణ టిడిపి దళిత, గిరిజననేతలు తీవ్రస్థాయిలో ధ్వజమె త్తారు. టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్లతో పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, జిల్లా నాయకులు చంద్రశేఖర్, ఎస్‌సిసెల్ అధ్యక్షులు దావులూరి దేవకుమార్‌లు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చినప్పటికి నుంచి దళిత, గిరిజన నేతలు కార్యకర్తలపై హత్యారాజకీయాలు జరుగుతున్నాయని అదే క్రమంలో జగన్‌మోహన్‌రెడ్డి అడుగుజాడల్లో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి నడుస్తూ హత్యా రాజకీయల్లో పోటీపడి మారీ చేయిస్తున్నారని విమర్శించారు. రూరల్ మండలం త్రాగేటివారిపాలెంకు చెందిన చాట్ల వాసు అనే వ్యక్తి టిడిపిలో బలంగా ఉన్నాడని పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే అనచరుడు మాజీ సర్పంచ్ మంద మదు ప్రధాన నిందితుడిగా ఉండి హత్యకు పాల్పడడం జరిగిందన్నారు. గతంలో వైసిపి అధికారంలో ఉన్నప్పుడు కరుణాకర్, తేజపై దాడి హర్ష అనే టిడిపి ఎసిసి నేతలపై మాజీ ఎమ్మెల్యే హత్య రాజకీయాలు చేశారని తెలిపారు. ఇలాంటి చర్యలకు ఎమ్మెల్యే దూరంగా ఉంటూ కావలిని అభివృద్ధి చేస్తున్నారన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని ఆ కుటుంబానికి టిడిపి పార్టీ, ప్రభుత్వం అండబగా ఉంటుందని తెలిపారు. వైకాపా తీరు మారకపోతే ఎమ్మెల్యే అనుచరులతో తగిన బుద్ధి చెబుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి 10వ వార్డు టిడిపి ఇన్‌చార్జ్ వల్లేరి వెంకటకిరణ్‌కుమార్, దళిత నాయకులు లేలపల్లి సుదీర్, మొగిలి విజయ్, అక్కిలిగుంట సూరి ప్రకాస్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణులను నమ్మించి నట్టేట ముంచిన జగన్మోహన్ రెడ్డికి బ్రాహ్మణ సంక్షేమం గురించి మాట్లాడే అర్హత లేదు

**– బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్**



**నెల్లూరు, జూలై 20, ప్రభాతవార్త – వైద్యం :** బ్రాహ్మణులను నమ్మించి నట్టేట ముంచిన జగన్మోహన్ రెడ్డికి, కానీ వైసీపీ నాయకలకు బ్రాహ్మణ సంక్షేమం గురించి మాట్లాడే అర్హత లేదని బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్ అన్నారు. సోమవారం నెల్లూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమిప్రభుత్వం చేస్తున్న బ్రాహ్మణ సంక్షేమాన్ని గణాంకాలతో సహ సోదాహరణంగా వైసీపీ విమర్శలను తిప్పికొట్టారు. వైసీపీ ప్రభుత్వంలో బ్రాహ్మణ కార్పొరేషన్ ను బీసీ కార్పొరేషన్ లో కలిపి నేడు సిగ్గు లేకుండా మాట్లాడడం వైసీపీ అవివేకానికి నిదర్శనమన్నారు. వైసీపీ ప్రభుత్వంలోని రాష్ట్ర దేవాదాయ శాఖ మాజీ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ ఆదివారం నెల్లూరులో ప్రెస్ మీట్ పెట్టి తెలుగుదేశం పార్టీ బ్రాహ్మణులు తెలుగుదేశం పార్టీ మోసం చేసిందని, బ్రాహ్మణ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిందని మాట్లాడడం జరిగిందన్నారు. వైసీపీ పార్టీ నాయకులకు ఒకటే సవాల్ చేస్తున్నామని, బ్రాహ్మణ కార్పొరేషన్ స్థాపించింది ఎవరు..? ఏ ప్రభుత్వం..? చంద్రబాబు నాయుడు 2015లో బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి దేశంలోనే విస్తృతంగా ఎక్కడ జరగని విధంగా బ్రాహ్మణ సంక్షేమానికి అనేక పథకాలు పెడితే వాటిని బ్రాహ్మణ సామాజిక వర్గంతో అనుబంధంగా ఉన్న దేవాదాయ శాఖతో నిర్వహిస్తూ ఉంటే జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రావడంతోటే 2019లో బ్రాహ్మణులకు చేసిన ఘోరమైన మోసం బ్రాహ్మణ కార్పొరేషన్‌ను బీసీ కార్పొరేషన్‌లో విలీనం చేయడమన్నారు. అయితే తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని తమ జిల్లా మంత్రి దేవాలయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో బ్రాహ్మణ కార్పొరేషన్‌ని మరలా దేవాలయ శాఖకు తీసుకొని వచ్చిన పార్టీ, ప్రభుత్వం తెలుగుదేశం పార్టీ అన్నారు. నేడు సిగ్గు లేకుండా బ్రాహ్మణ కార్పొరేషన్‌ను బీసీ కార్పొరేషన్‌లో విలీనం చేసి మళ్ళా మాట్లాడతారా అని ప్రశ్నించారు. బ్రాహ్మణ సంక్షేమం తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వానికి మాత్రమే సాధ్యమని ఈ సందర్భంగా తెలియజేశారు. చాలీచాలని జీతంతో ఉన్నటువంటి చిన్న దేవాలయాల అర్చకులకు 10 వేల నుంచి 15 వేల రూపాయల జీతం ఒకేసారి పెంచిన ఘనత కూటమి నేతృత్వంలోని చంద్రబాబు నాయుడు ప్రభుత్వమని తెలియజేశారు. రాష్ట్రంలో డిడిఎన్ ధూప దీప నైవేద్యం కింద 5 వేలు ఉన్న పారితోషికాన్ని ఒకేసారి 10 వేల రూపాయలకు పెంచిన ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వం కాదా అని తెలిపారు. రాష్ట్రంలో దేవాలయ వ్యవస్థను ధ్వంసం చేసి, దోపిడీ చేసి, రథాలను తగలబెట్టి విగ్రహాలను తలలు నరికి, సనాతన ధర్మానికి అపచారం చేసిన వైసిపి పార్టీ బ్రాహ్మణ సంక్షేమం గురించి మాట్లాడం గురివింద సామెత మాదిరి వుందన్నారు. అంతర్వేది, బిట్రగుంట్ల రథాలు తగలబెట్టడం, విజయనగరం జిల్లా రామతీర్థంలో రాముడి విగ్రహం తల నరకడం, దుర్గమ్మ గుడిలో వెండి నందులు దొంగతనం చేయడం ఇవన్నీ ఎవరు చేశారని ప్రశ్నించారు. టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు గురించి మాట్లాడే స్థాయి వైసీపీ వాళ్లకు లేదన్నారు. వైసీపీ పాలనలో తిరుమలలో ఏ విధంగా అరాచకాలు చేశారు, ఆఖరకు వెంకటేశ్వర స్వామికి నివేదన చేసేటటువంటి లడ్డులో వాడే నెయ్యిని కూడా కల్తీ చేసిన దోపిడీ పార్టీ వైసీపీ పార్టీ అన్నారు. నేడు తిరుమల తిరుపతి దేవస్థానంలో కూటమి పాలనలో లడ్డు ఏ విధంగా ఉందో, అన్న ప్రసాద వితరణ ఏవిధంగా ఉందో ఒక్కసారి భక్తుల్ని అడిగి తెలుసుకోమని సూచించారు. లక్షలాది మంది తిరుమల కొండ మీదకు వచ్చినా భక్తులెవరికీ ఇబ్బందులు లేకుండా అందరికీ దర్శనం చేయిస్తున్నటువంటి చైర్మన్ బిఆర్ నాయుడుని విమర్శించే అర్హత వారికి లేదన్నారు. రాష్ట్రంలో తల్లికి వందనం ద్వారా 202526 సంవత్సరానికి 27 కోట్ల 69 లక్షల 39 వేల రూపాయలు, ఫీజ్ రీ ఎంబర్స్మెంట్ ద్వారా 11 కోట్ల 74 లక్షల 13వేల రూపాయలు, బ్రాహ్మణ వృద్ధులు, వితంతువులకు సామాజిక పెన్షన్లు, ఎన్టీఆర్ భరోసా కింద నెలకు 41 వేల మందికి 21 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని ఉచ్చి తెలిపారు. అదేవిధంగా బ్రాహ్మణ కార్పొరేషన్‌కు అనుబంధంగా బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా 2024 నుంచి 26 ఆర్థిక సంవత్సరకాలంలో 14, 397 మందికి 1,13,15,950 రూపాయలు రుణాలు మంజూరు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదని తెలిపారు. ఈ నెల 24వ తేదీ ఇచ్చే తల్లికి వందనం కార్యక్రమంలో వేలాదిమంది బ్రాహ్మణులకు ప్రయోజనం కలగడం లేదా అని అడుగుతు న్నామ న్నారు. బ్రాహ్మణ సంక్షేమం గురించి మాట్లాడే అర్హత వైసిపి నాయకులకు లేదని ఆ విధంగా మాట్లాడితే గట్టిగా బుద్ధి చెప్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఇసుకపల్లి కామేశ్వర ప్రసాద్, జిల్లా బిజెపి ధార్మిక సెల్ కన్వీనర్ సోమరాజు పల్లి నాగపణి శర్మ, జనసేన నాయకులు రంగనాయక స్వామి దేవస్థానం బోర్డు మెంబర్ శరవణ మహేష్, పెనుబర్తి సాయిరాం, రాఘవ విశ్వనాథం, కుప్పచ్చి చంద్రశేఖర రావు, సుధాకర్ శర్మ, హనుమంతరావు రాజు శర్మ, తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్ వార్డెన్ పై విద్యార్థుల ఆరోపణలు

**– స్పెండ్ చేయాలని విద్యార్థి, ఎమ్మార్పీఎస్ నాయకుల ఆందోళన**



**వింజమూరు, జూలై 20, ప్రభాతవార్త :** వింజమూ రులోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతిగృహంలో వార్డెన్ విద్యార్థులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపిస్తూ విద్యార్థులు, విద్యార్థి సంఘ నాయకులు, ఎంఎస్‌పి, ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం ఆందోళన చేశారు. ఆంధ్ర విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మహంతి రెడ్డి ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేడ్కర్ విద్యార్థులకు మద్దతుగా హాస్టల్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టల్లో సుమారు 80 మంది నిరుపేద విద్యార్థులు చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చి చదువుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం అందించే మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని ఆరోపించారు. ఒక లీటర్ పెరుగులో రెండు బకెట్ల నీళ్ల పోసి 80 మందికి వడ్డిస్తున్నారని, చికెన్, కోడిగుడ్ల విషయంలో కూడా ప్రభుత్వం చెప్పిన మెనూ ఒక్కరోజు కూడా అందించడం లేదని పేర్కొన్నారు. దీనిపై ప్రశ్నిస్తే విద్యార్థులను అసభ్యంగా దూషిస్తూ కర్రతో కొడుతున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్లో విద్యుత్ మోటారు వేయడానికి ఉంచిన కర్రతో కొడుతూ, విద్యార్థుల తల్లులపై కూడా అసభ్యంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ మేకపాటి శాంతికుమారి వింజమూరులో పర్యటించగా విద్యార్థులు ధైర్యం చేసి తమ గోడును ఆమె దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన శాంతికుమారి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఛైర్‌పర్సన్‌కు ఫిర్యాదు చేశారన్న కక్షతో సోమవారం ఉదయం మరలా విద్యార్థులను వార్డెన్ కొట్టడంతో ఆంధ్ర విద్యార్థి సంఘ నాయకులకు, ఎంఎస్‌పి ఎమ్మార్పీఎస్ నాయకులకు సమాచారం అందింది. దీంతో వారు వసతిగృహం వద్దకు వచ్చి ఆందోళన చేపట్టారు. ఇలాంటి వికృత చేష్టలకు పాల్పడుతున్న వార్డెన్ పై వెంటనే చర్యతీసుకోవాలని, సమగ్ర విచారణ జరిపించి సర్వీస్నుంచితొలగించాలని డిమాండ్ చేశారు. కేవలం బదిలీలు, సస్పెన్షన్లతో ఈ సమస్య పరిష్కారం కాదని స్పష్టం చేశారు. ఆందోళన సమాచారం అందుకున్న వింజమూరు ఎస్సై ఉమామహేశ్వరావు, ఏఎస్ఐ జయరాజును ఘటనా స్థలానికి పంపారు. జయరాజు నేతృత్వంలోని సిబ్బంది విద్యార్థుల ఆందోళనకు గల కారణాలను తెలుసుకున్నారు. అనంతరం ఎస్‌డబ్ల్యూ అధికారులు గీతాదేవి, రమణారెడ్డి హాస్టల్‌కు వచ్చి విద్యార్థులు, ఆందోళనకారులతో చర్చలు జరిపారు. ఈ ఘటన తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు కూడా హాస్టల్ వద్దకు చేరుకున్నారు. మేము కూలీనాలి చేసి పిల్లలను చదివిస్తుంటే వసతి గృహాలలో ఇలా హింసిస్తే ఎలా? తల్లిదండ్రులు కూడా తిట్టని మాటలు అంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పేద విద్యార్థుల సంక్షేమం కోసం కోట్లు ఖర్చు చేస్తున్న తరుణంలో ఇలాంటి బాధ్యతారాహిత్య ఘటనలు చాలా బాధాకరమని వాపోయారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూ గీతాదేవి మాట్లాడుతూ సమగ్ర విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ బాలికల వసతి గృహ సంక్షేమ అధికారిని భారతి, ఆంధ్ర విద్యార్థి సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు భరత్, విద్యార్థి సంఘ నాయకులు హజరత్, మాధవ్, హర్ష, వినీల్, ఎమ్మార్పీఎస్ ఆనంద్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

## ముందే వేడెపుట్టిస్తున్న... స్థానికం

### అధికార పార్టీకి సవాల్, వైసీపికి ప్రతిష్టాత్మం

**కోట, జూలై 20 ప్రభాతవార్త :** స్థానిక ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. సర్ ప్రక్రియ పూర్తికాగానే స్థానిక ఎన్నికలు జరపడానికి ప్రభుత్వం కూడా సంసిద్ధత చూపడంతో వేడి పుట్టింది. ఎన్నికల జరిపించాలనేది ప్రభుత్వ ఆలోచనగా ఉంది. స్థానిక సంస్థలు ఎన్నికలు అధికార కూటమి పార్టీకి సవాల్‌గా తీసుకుంటుండగా వైసీపి ప్రతిష్టాత్మంగా తీసుకుంటుంది. ఈ నేపథ్యంలో ఆటు సీఎం చంద్రబాబునాయుడు, ఇటు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కూడా పార్టీ శ్రేణులతో సమాలోచనలు మొదల పెట్టారు. స్థానిక సంస్థల్లో గెలపే ధ్యేయంగా రెండు ప్రధాన పార్టీలు ముందుకు రానున్నాయి. నియోజకవర్గంలో వైసీపి కొంత మేర ఉత్సాహంగా లేకపోవడంతో నియోజకవర్గ సమన్వయకర్తను కూడా వైసిపి మార్చేసింది. కొత్త నాయకుడు గురువయ్యను నియమించింది. పార్టీ కోసం పనిచేసిన వారికి స్థానిక ఎన్నికల్లో సీట్ల కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని వైసిపి ఆలోచనగా ఉన్నట్లు సమాచారం. అదే కోణంలో కూటమి నాయకులు కూడా ఉన్నారు. నియోజకవర్గంలో జనసేన బిజెపి అధిక స్ధానాలను కోరే అవకాశం ఉంది. ప్రధానంగా రిజర్వేషన్ల ఏలా వస్తాయోనే విషయంపై గ్రామాల్లో చర్చులు నడుస్తున్నాయి. కోటలో ఓ అధికార పార్టీ నాయకుడు ఈ సారి మహిళ ఓసి వస్తుందని దీంతో తన సతీమణికి పంచాయతీ సీటుని తన అనుచులుగా వద్ద ప్రచారం చేసుకుంటునట్లు తెలుస్తుంది. అయితే కోట లో తెదేపాలో రెండు వర్గాల వారు ఐక్యతారాగం ఆలపించి ఆనాయకుడుకి సహకరిస్తారా ? అనేది కూడా మరో పక్క చర్చి నడుస్తుంది. జలీల్‌అహ్మద్ కూడా ఈసారి పంచాయతీ తనేదేనని తన అనుచులు వద్ద అంటున్నట్లు సమాచారం. నెల్లూరుపల్లి కొత్తపాళెంలో స్థానిక ఎన్నికల్లో సైకిల్ దూకుడు పెంచుతోందని ఆగ్రామ నాయకుడు నెల్లూరు మోహన్‌రెడ్డి తన అనుచురుల వద్ద దిశనిర్దేశం చేస్తున్నారు. పంచాయతీని రెండుళ్లలో ఏంతో అభివృద్ధి చేశామని చెప్పకవస్తున్నారు. ఇక వెంకన్నపాళెం పంచాయతీలో మళ్లీ తనదే గెలుపుని తనకు తిరుగులేదని కొకర్ల ముద యాదవ్ అంటున్నట్లు సమాచారం. సిద్దవరంలో కూడా సైకిల్ స్పీడు పెంచుతుందని ఆగ్రామ తెదేపా నాయకుడు రామయ్య ఇప్పటికి ప్రకటించారు.

## విద్యుత్ ట్రాన్స్ఫారం తీగలు తగిలి గేదెల మృతి



**వింజమూరు, జూలై 20, ప్రభాతవార్త :** మండలంలోని నంది గుంట సమీపంలోని జాగీర్ వనం వద్ద విద్యుత్ ట్రాన్స్ఫారం తీగలు తగిలి 2 గేదెలు మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకున్నది. వివరాల్లోకెళ్తే గంగపట్ల నాగేశ్వరరావు అనే రైతుకు సంబంధించిన గేదెలు మేతకు వెళ్లి వచ్చే సమయంలో విద్యుత్ ట్రాన్స్ఫారం వైరు తగిలి గేదెలు మృతి చెందినట్లు ఆయన తెలిపారు. గేదెల విలువ సుమారు లక్ష అరవై వేల రూపాయలు ఉంటుందని రైతు నాగేశ్వరరావు వాపోయారు. మాకు జీవనాధారంగా ఉన్న గేదెలు మృతి చెందడంతో కుటుంబ పరిస్థితి అయోమయంలో ఉందన్నారు. అందువల్ల అధికారులు స్పందించి సహాయం అందించగలరని అభ్యర్థిస్తున్నారు.

## అక్రమవ్యర్థాల వాహనాన్ని అడ్డుకున్న మర్రిపాడు ఎస్ఐ



**మర్రిపాడు, జూలై20, ప్రభాతవార్త:** మైదుకూరు నుండి చికెన్ వ్యర్థాలను అనుమతి లేకుండా తరలిస్తూ వాటిని చేపలకు, పందులకు ఆహారంగా వేస్తూ ప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తూ, ప్రయాణీకులకు, వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్నారన్న సమాచారం మేరకు మర్రిపాడు ఎస్ఐ బలరామిరెడ్డి ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు తన సిబ్బందితో మర్రిపాడు మండలం చుంచులూరు క్రాస్ రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేసునతండగా బద్వేల్ నుండి మర్రిపాడు వైపు వస్తున్న ఎపి 39 విడి 4703 నెంబరుగల బొలెరో వాహనం తనిఖీ చేయగా అందులో ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న సుమారు 12 డ్రమ్ముల చికెన్ వ్యర్థాలను స్వాధీనపరచుకొని ఆ వాహన యజమాన్ని అందుబాటులో లేకపోవడంతో వాహన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి చికెన్ వ్యర్థాలను రెవెన్యూ వారి సమక్షంలో ఊరి బయట పూడ్చి వేయడమైంది.

## ఆస్తి తీసుకొని తండ్రిని నిర్లక్ష్యం చేసిన కుమారుడు



**అనుమసముద్రంపేట, జూలై20, ప్రభాతవార్త:** ఏఎస్‌పేట మండల తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహిఒచిన గ్రీవెన్స్‌డేలో అనుమసముద్రం గ్రామానికి చెందిన వృద్ధుడు సోము హజరత్‌రెడ్డి తనకు న్యాయం చేయాలని ఇన్‌ఛార్జీ తహసిల్దార్ జి.వెంకటేశ్వరుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తనకు ముగ్గురు కుమారులున్నారని, వారందరికి వివాహాలు చేసి ఒక్కక్కరికి సుమారు 7ఎకరాల వంతున ఆస్తి పంచి ఇచ్చానన్నారు. అనంతరం తన వద్ద మిగిలిన ఒక ఎకరం భూమిని తన చిన్నకుమారుడు రమణారెడ్డి, కోడలు తమను బాగు చూసుకుంటామని నమ్మబలికి తీసుకున్నారని చెప్పారు. కొంతకాలం బాగానే చూసుకున్నప్పటికీ ప్రస్తుతం తనపై తాడిచేసి ఇంటినుంచి వెళ్ళగొట్టారని ఆరోపించారు. మనస్తాపానికి గురై ఆత్మహత్యకు ప్రయత్నించగా పెద్ద కుమారుడు అడ్డుకొని ప్రస్తుతం తనకు అన్నం పెడుతున్నాడని, అనారోగ్యంగా ఉన్న సమయంలో తనను చూసుకునే పరిస్థితి లేదని కన్నీటి పర్యంతమయ్యారు. అనుమసముద్రం గ్రామంలోని సర్వే నెంబర్ 112/1సిలో తాను కోనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న 50సెంట్లు భూమిలో ముగ్గురు కుమారులకు ఇళ్ళునిర్మించి కొంత స్థలాన్ని విక్రయించగా ప్రస్తుతం మిగిలిన 150అంకణాల స్థలాన్ని తన పేరుతో 1-బి అడంగల్‌లో నమోదు చేయాలని తహసిల్దార్‌ను కోరినట్లు తెలిపారు. అలాగే తన పేరుతో అనుభవంలో ఉన్న ఒక ఎకరం మాగాణి భూమిని కూడా 1-బి రికార్డుల్లో నమోదు చేయాలని కోరారు. తన చిన్నకుమారుడు తనను మోసం చేసి తన అధీనంలో ఉన్న భూమిని స్వాధీనం చేసుకున్నాడని ఆరోపించిన హజరత్‌రెడినడ తనకు న్యాయం చేయాలని అధికారులను వేడుకున్నారు. ఆయన ఫిర్యాదును స్వీకరించిన తహసఇల్దార్ సంబంధిత అంశాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

## తహసీల్దార్‌కు బీజేపీ నేతలు వినతిపత్రం

**చేజర్ల, జూలై 20, ప్రభాతవార్త :** రాష్ట్ర బీజేపీ కమిటీ ప్రవేశపెట్టిన జనతా వారధి కార్యక్రమంలో భాగంగా చేజర్ల మండల తహసీల్దార్ మస్తానయ్యకు మండల బీజేపీ నేతలు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈ వినతిపత్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు ఇండస్ట్రియల్ పార్కుల అభివృద్దిలో ఎస్సీ, బీసీ, ఎస్టీ వర్గాల వారికి సముచిత స్థానం కల్పించాలని కోరారు. పారిశ్రామిక రంగంలో వెనుకబడిన వర్గాల వారికి యాజమాన్య అవకాశాలు, ఉపాధి కల్పించే విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరక్టర్ బత్తుల కిష్టయ్య, రాష్ట్ర కిసాన్ మోర్చా నాయకులు కుంకు బాలయ్య నాయుడు, మండల నాయకులు శివారెడ్డి, వెంకటయ్య, పెంచలయ్య, కాలేషా, ప్రసాద్ పాల్గొన్నారు.

## గొప్ప మనసు చాటుకొన్న శ్రీ చైతన్య జూనియర్ కళాశాల యాజమాన్యం



**కావలి, జూలై 20 ప్రభాతవార్త :** పట్టణంలోని సంయుక్త సేవా సంస్థ దత్తత తీసుకొన్న విద్యార్థిని కొమరగిరి మహితకు స్థానిక పాత ఊర్లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల యాజమాన్యం రెండేళ్ళపాటు ఉచిత విద్యను అందించేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావడం జరిగింది. కళాశాల కన్వీనర్ నందనవనం మదుసూదన్‌రావు మాట్లాడుతూ సేవా సంస్థ అధ్యక్షులు సురేంద్ర సంస్థను స్థాపించి 13ఏళ్ళు నుంచి చేస్తున్న సేవ లను గుర్తించి వారు దత్తత తీసుకొన్న పిల్లల్లో ఒకరిని తమ కళాశాల నుంచి ఉచితంగా చదివించాలనే ఉద్దేశ్యంతో కొమరగిరి మహితకు ఉచితంగా సీటు కేటా యించడం జరిగిందన్నారు. ప్రతి ఏడాది ఒక్క విద్యార్థికి ఉచితంగా విద్యను అందిస్తామని తెలిపారు. సంస్థ అధ్యక్షులు సురేంద్ర మాట్లాడుతూ మహితకు శ్రీ చైతన్య కళాశాల జూనియర్ కళాశాలలో ఉచిత సీటు కేటాయించడంపై హర్షం వ్యకతం చేసి యాజమన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎస్.వెంకయ్య డైరెక్టర్ టీవీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మా భూమిని సర్వేయర్‌చే కొలతలు వేయించాలి



**కావలి, జూలై 20 ప్రభాతవార్త :** మా భూమి 20సెంట్లు తక్కువగా ఉందన్న అనుమానంతో మా భూమి మొత్తాన్ని సర్వేయర్‌చే కొలతలు వేయించాలని స్థానిక సొసైటికాలనీకి చెందిన పాపమ్మ కుమార్తె అరుణ సోమవారం ఆర్డీఓ ఎలీసాబాబుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కావలి రూరల్ మండలం తుమ్మలపెంట పంచాయితీ కొత్త సత్రంగ్రామంలో సర్వేనెంబర్ 1213 పొలం కలదు. పామంజి సొమయ్య కుమారులు శ్రీరాములు, పొట్టెయ్య వారిపేర్లపై 14.41 సెంట్లు ఉందన్నారు. పొట్టెయ్యభార్య పాపమ్మ పేరుపై 7.20సెంట్లుకు పాసుపుస్తకం తెప్పించుకొన్నట్లు తెలిపారు. ఈనెల 7న పామంజి శ్రీరాములు కుమారులు, కుమార్తెలు వారికి వచ్చిన బాగానికి కొలతలు వేయించుకోగా 7.41సెంట్లు ఉన్నట్లు సర్వేయర్‌తేల్చిరన్నారు. ఇందులో భూమి తక్కువగా ఉన్నందున భూమి మొత్తాన్ని సర్వేయర్‌చే కొలిపించి న్యాయం చేయాలని కోరారు.

## జీఓనెంబర్ 396 రద్దు చేయాలని నిరసన



**కావలి, జూలై 20 ప్రభాతవార్త :** ఏపి దస్తావేజుల లేఖరుల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపమేరకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రిజిస్ట్రేషన్‌శాఖ ప్రైవేటీకరణను వ్యతిరేకేస్తూ రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న పెన్‌డౌన్ కార్యక్రమంలో భాగంగా జిఓనెంబర్ 396ను రద్దు చేయాలని కోరుతూ సోమవారం కావలి డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్ వెండర్ల ఆసోసియషన్ ఆధ్వర్యంలో నిరసన, పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిఓను రద్దు చేయాలని నినాదాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఏపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన జిఓనెంబర్ 396తో నూతనంగా ప్రవేశపెట్టిన రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు, పబ్లిక్ ప్రైవేట్ పాపర్టీస్ విధానం ద్వారా ప్రజలకు నష్టం జరుగుతుందని తెలిపారు. దీనికి ఈనెల 20నుంచి 31వరకు పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దస్తావేజుల లేఖరులు, స్టాంపువెండరు, డిటిపి ఆపరేటర్లు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యఓఉలు పీడివిఎం ప్రపసాద్, అధ్యక్షులు ఆవిరివెట్టి వెంకట్రావు, వైస్ ప్రెసిడెంట్ ఉప్పాల కిరణ్, సెక్రటరీ ఎస్‌కె పార్దు, జాయింట్ సెక్రటరీ గుడిపల్లి వెంకట్రావు, ట్రెజరర్, మీడియా కోఆర్డినేటర్ బెజవాడ ప్రసన్నకుమార్, దస్తావేజుల లేకరులు, స్టాంపు వెండర్లు, టిడిపి ఆపరేటర్లు పాల్గొన్నారు.

## సర్ కు నాలుగు రోజులే గడువు

**బిట్రగుంట జూలై 20 ప్రభాతవార్త :** రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం సర్ కార్యక్రమానికి ఇక నాలుగు రోజుల వ్యవధి ఉండగా మండలంలో ఓటు హక్కు ఉండి ఎవరికైనా ఫారాలు అందకపోయినా, వారి ఫారాలు భర్తీ చేసి ఇవ్వకపోయినా ఓటు హక్కును కోల్పోతారని అటువంటివారు తక్షణమే సంబంధిత బిఎల్ఓ లను సంప్రదించాలని మండల తాసిల్దార్ సామా శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. మండలంలో 39436 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారని, అందులో34,355 మంది తమ ఫారాలు భర్తీ చేసి ఇవ్వడం జరిగిందన్నారు.. దీంతో ఇప్పటివరకు మండలంలో 87!! ఈ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందన్నారు.. ఇంకనూ ఎవరైనా ఉంటే తక్షణమే వారి ఓటు హక్కును పోతుందని ఈనెల 24 వరకు గడువు ఉందని దానిని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు

